

సాయంత్రం నాలుగవుతోంటే రవి ఇంటికి మోహన్ వొచ్చాడు.

"కమాన్! మంచి టైముకి వొచ్చావు!" అంటూ స్వాగతం చెప్పేడు రవి.

"ఏమిటా మంచి సమయం? అసలు టెలిఫోన్ చేసి వద్దామనుకున్నాను. కాని ఇదే బాగుంటుందని తిన్నగా వొచ్చేశాను" అన్నాడు సోఫాలో కూర్చుంటూ మోహన్.

"మంచి సమయం ఎందుకంటే, సెలవురోజు కదా! కాని ఎక్కడికీ వెళ్లాలని లేదు- ఇంట్లో ఉండాలని లేదు. కాలేజీరోజుల పాత ఫ్రెండుని కలియడం కన్నా సంతోషం లేదు" అన్నాడు రవి.

"నేనూ అలాగే అనుకున్నాను.." అన్నాడు మోహన్ సిగరెట్ వెలిగించుకుంటూ.

"నిన్న సాయంత్రం వెళ్లిపోతానన్నావు.... వెళ్లలేదన్నమాట" అన్నాడు రవి.

"లేదు. వీళ్లందరూ ఉద్ధావతారాలు ఏం చెప్పినా ఒక పట్టాన తల కెక్కదు. అక్కడ హెడ్డాఫీసులో వాళ్లు ఫైనల్ స్కీము కోసం ఎదురుచూస్తున్నారు.... చివరికి ఆవేళ ముగించేం. నువ్వు లక్కీ ఫెలోవి రవీ! ఏ బాదరబందీలు ఉండవు. కనీసం సెలవురోజున అయినా ఇంటిపట్టున ఉండవొచ్చును" అన్నాడు మోహన్.

"అక్కడ నీకూ సెలవులు ఉంటాయిగా! బొంబేలో బోర్ కొట్టడానికి

అసాధారణం తక్కువ!" అన్నాడు రవి.

"పేరుకే. ఈ ఫారినర్స్ వచ్చినప్పుడల్లా నేనూ వాళ్ళతో ఉండాల్సిందే. లేకపోతే ఏదో ఫంక్షన్. ఎవరమ్మాయిదో అన్నప్రాశనం... ఒంటరిని ఉండక్కర. పూర్ రాజీ విసిగిపోతోంది. నాతోబాటు ఆమె కూడా తిరగాలి కదా!. సరేగానీ, శ్రీమతి ఉందా? లేదా? ఇంట్లో ఎక్కడా అలికిడి లేదు—నిద్రపోతుందా?" అన్నాడు మోహన్.

"ఉంది. టిఫిన్ చేస్తోంది...." అని చెప్పి లోపలికివెళ్ళి మమతని తీసికొచ్చి, "ఇతను నా పాత ఫ్రెండు మోహన్. చెప్పేను గా!" అంటూ పరిచయం చేశాడు.

"ఎప్పుడో మిమ్మల్ని కలవాల్సింది. పెళ్ళికి వద్దామనుకుంటే కుదరలేదు. పోనీయండి, ఇవాళ అయినా రవీ మీరూ దొరికారు! రవీ! నిజంగా నువ్వు లక్కీ ఫెలోవి" అన్నాడు మోహన్.

"కాఫీ తెస్తాను" అంటూ లోపలికి వెళ్ళింది మమత.

"వెరీ నైస్! కంగ్రాట్స్!" అన్నాడు మోహన్.

"థేంక్స్!" అన్నాడు చిరునవ్వుతో, రవి. మోహన్ చాలా చతురుడు— ఎప్పుడు ఏది ఎలాగ చెప్పాలో అతనికి బాగా తెలుసు. కాని, మమత నిజంగానే చాలా బాగుంటుంది— నిజానికి భార్యలో ఆశించే మంచివన్నీ ఆమెలో ఉన్నాయి. తమ జీవితం సాఫీగా సాగిపోతోంది. అందులో అత్యున్నతమైన ఆనంద శిఖరాలు లేకపోవడం ఆమె తప్పు కాదు. దానికి తనలోఉన్న అసంతృప్తి కారణం—ఆ అంతృప్తికి కారణం ఎదురుగా కూర్చున్న మోహన్.

మోహన్, రవీ మేనేజిమెంటు చదువుతూ స్నేహితులయారు. ఇద్దరిదీ ఒకే ప్రాంతం కావడం తప్పిస్తే మిగిలిన వాటిలో వారి అభిరుచులు వేరువేరుగా ఉండేవి. క్లాసులో ఎప్పుడు తన ఘనతని నలుగురికీ చూపాలనే మనస్తత్వం మోహన్‌ది. మరీ ముందుకు తోసుకు రావడం రవికి నచ్చేది కాదు. తనకి ఉన్న ఆస్తిపాస్తులని గురించి రవి దగ్గరకాని, మిగిలినవాళ్ళ దగ్గరకాని మోహన్ ఎప్పుడూ దాపరికం లేకుండా చెప్పేవాడు. చెప్పుకోవడానికేమీలేని మధ్య తరగతి మనిషి రవి; ఆ మాట ప్రత్యేకంగా చెప్పడం అతనికి ఇష్టం ఉండేది కాదు. కాని వాళ్ళిద్దరి మధ్య స్నేహం గాఢంగానే ఉండేది.

మమత ట్రేలో ఇడ్లీ, చట్నీ, నెయ్యీ, అవకాయా తెచ్చింది.

"అరే! ఇక్కడికే తెచ్చావా? అక్కడికే వచ్చి తినేవాళ్ళం కదా!" అన్నాడు రవి.

"ఫరవాలేదు లెండి! కబుర్లు చెప్పుకుంటున్నారు. కదపడం ఎందుకని ఇక్కడికే తెచ్చేను.... మోహన్‌గారూ!

మొహమాట పడకండి" అంది ఇడ్లీ ప్లేట్‌లో పెట్టి ఇస్తూ.

"చట్నీ, ఆవకాయా చూసేసరికి నోరూరుతోంది! నాకు మొహమాటం ఉన్నా ఎగిరిపోయింది!" అన్నాడు మోహన్.

"నువ్వూ ప్లేటు తెచ్చుకో!" అన్నాడు రవి

"అలాగే లెండి.. ముందు మీరు కానివ్వండి...." అంది మమత.

మోహన్ చాలా ఇష్టంగా ఇడ్లీ తిన్నాడు. చట్నీ చాలా నచ్చింది అతనికి.

"థేంక్స్అండీ! ఇంత రుచిగా ఇడ్లీ తిని ఎంతకాలమో అయిపోయింది" అన్నాడు. మమత నమ్మలేనట్టు చూసింది.

"ఇతనికి అలాగ పొగడ్డం వెన్నతో పెట్టిన విద్యలే మమతా! అందుకే అంతవాడయాడు. ఇడ్లీ బాగున్నమాట నిజమే కాని, మిగిలింది నమ్మకు!" అన్నాడు.

మమత చిరునవ్వుతో ఖాళీప్లేట్లు అవీ లోపలికి పట్టికెళ్లి కాఫీ తెచ్చింది.

సిప్ చేసి, "అతిశయోక్తు లంటారని భయం వేసినా అనక తప్పదు. కాఫీ కూడా అత్యద్భుతంగా ఉంది! థేంక్స్!" అన్నాడు.

మమత వాళ్లతో కాఫీ తాగింది. వాళ్లూ ముగించి లోపలికి వెడుతోంటే "ఒక్క క్షణం రాత్రి డిన్నర్ కి రండి. రజనికీ మమతకీ పరిచయం అవుతుంది. ఆమె నిన్న మహాబలిపురం వెళ్లింది మొన్న కంచి వెళ్లింది. ఇవేళ మీరిద్దరూ రండి" అన్నాడు మోహన్.

మమత రవివేపు చూసింది.

"దానికేం మోహన్! కాని మీ రిద్దరూ ఇక్కడికి రండి.... సరదాగా కబుర్లు చెప్పుకుందాం...." అన్నాడు రవి

కొంచెం ఆలోచించాడు మోహన్..

"గుడ్!.... మళ్లీ మమతగారు చేసిన పచ్చడి తినే అవకాశం దొరకడం నా అదృష్టం వొచ్చేస్తాం." అని లేచి నిలబడి, "ఇంక వెడతాను రవీ! రజనీ ఎదురుచూస్తూ ఉంటుంది... రాత్రి తీరికగా కబుర్లు చెప్పుకుందాం" అని సెలవు తీసుకుని వెళ్లిపోయాడు.

అతను వెళ్లిన తరవాత మమత కొంచెంసేపు మాట్లాడలేదు. ఏమిటో ఆలోచనలో పడింది.

"ఏమిటంత తీవ్రమైన ఆలోచన!- రాత్రికి ఏం చేయాలనా?" అన్నాడు రవి.

"అవును."

"నీ వంట అతనికి నచ్చుతుంది. అదేలే. మన ఇంట్లో.. కుక్ తో చెప్పి చేయించు. నువ్వు అనవసరంగా శ్రమ పడకు" అన్నాడు రవి. మమతకి వంట ఒక సరదా. కుక్ ఉన్నా ఆమె చాలా సార్లు స్వయంగా వొండుతుంది

"ఫరావాలేదు_అలాగే చేస్తాను" అని, మమత లోపలికి వెళ్లిపోయింది.

రవి ఆలోచనలు జ్ఞాపకాలలో పడ్డాడు.

కొంచెంసేపటి కిందట మోహన్ తనని లక్కీ-ఫెలో అనడం జ్ఞాపకంవొచ్చింది.

ఇద్దరూ మేనేజిమెంటు పూర్తిచేశాక ఈ కంపెనీకి ఇంటర్వ్యూలకి వొచ్చేరు. వొచ్చిన ఆరు గంటలలోనూ మోహన్ మూడోవాడిగానూ రవి ఐదోవాడిగానూ వెళ్లాల్సిఉందని సెక్రటరీ చెప్పేక తానూ అతనూ వెయిటింగ్ రూమ్‌లో కూర్చున్నారు. ఇంటర్వ్యూలకి ముందు ఇంకా పది నిమిషాల వ్యవధి ఉంది. మోహన్ లేచివెళ్లి పదినిమిషాలలో వొచ్చి కూర్చున్నాడు.

మూడో పేరుకి రవిని పిలిచారు.

రవి ఆశ్చర్యపడ్డాడు. కాని, తానే ముందు పొరపాటు చేశాననుకున్నాడు. ఇంటర్వ్యూ బాగానే అయింది- చాలా బాగా అయింది.

అతను తిరిగి రాగానే మోహన్ అతన్ని అడిగి జరిగినదంతా తెలుసుకున్నాడు. అయిదో అభ్యర్థిగా అతను ఇంటర్వ్యూకి వెళ్లేడు.

ఇద్దరూ సెలక్ట్ అయారు. ఒకరు సేల్సుకీ ఒకరు ప్రొడక్షన్‌కీ వెళ్లాలి. రవికి సేల్సుకి వెళ్లాలని ఉంది. మోహన్ అడిగితేఅలాగే చెప్పేడు. ఇంటర్వ్యూలో కూడా అతన్ని చాలావరకూ సేల్స్‌మీదే ప్రశ్నలు వేశారు.

"నువ్వు ?" అన్నాడు రవి.

"ఏదైతేనేం ?.... నాకు ప్రొడక్షన్ అన్నా సరదాయే! వాళ్లు ఏదంటారో !" అన్నాడు మోహన్.

అతను సేల్స్‌కి వెళ్లేడు. రవి ప్రొడక్షన్‌లోకి వెళ్లేడు. తరవాత తెలిసింది- రవి చాలా ఆలోచనతో, మాట్లాడవలసిన వాళ్లతో మాట్లాడి, పోస్టింగ్ సంపాదించేడని. మూడు నెలలు తిరక్కుండానే హెడాఫీస్‌కే, అక్కడ ఒక్క సంవత్సరంలో ఇంటర్‌నేషనల్ డివిజన్‌కే అతను మారేడు. రవి తన పని చేసుకుంటూ ఇక్కడే ఉండిపోయాడు. వీటి వెనక ఎంత క్రియ ఉందో రవికి క్రమంగా తెలిశాక అతను చాలా ఆశ్చర్యపడ్డాడు. కలిసినప్పుడల్లా ఇలాగే, "నువ్వు లక్కీ-ఫెలోవి. ఏ చీకూచింతా లేకుండా ఉన్నావు.... నేను యమయాతన పడిపోతున్నాను." అంటాడు.

అంతకన్నా, రవి మరిచిపోలేనిది రజని మాట.

తమ కంపెనీతో చాలా దగ్గర సంబంధం ఉన్న పెద్ద వ్యాపారస్తుడు జయరామ్‌గారి అమ్మాయి రజని. తరుచు రవి అతన్ని కలుసుకుంటూ ఉండేవాడు. ఫేక్టరీకి కావలసిన సరుకులు అతను అమ్ముతూండేవాడు. ఏ సమస్య వొచ్చినా వ్యక్తిగతంగా తెలుసుకుని దానికి తగిన చర్య తీసుకోవడం జయరామ్‌గారికి అలవాటు. అందుకే, ఉత్తరాల పద్ధతి పెట్టకుండా రవి అతన్ని కలుసుకునేవాడు.

నాలుగుసార్లు కలుసుకున్నాక జయ

రామ్ రవిని డిన్నర్‌కి పిలిచాడు.

చాలా ఆదరించి, గంటసేపు ఆ కబురూ ఈ కబురూ చెప్పి సరదాగా గడిపి.... "మీ వ్యక్తిగత జీవితం గురించి ఒక ప్రశ్న అడగనా?" అన్నాడు జయరామ్.

"తప్పకుండాను!" అన్నాడు రవి.

జయరామ్ అతనికి ఫ్రెష్‌గా విస్కీ-సోడా తయారుచేసి ఇస్తూ, "మీకు-వివాహం అయిందా?" అన్నాడు.

ఏమి అడుగుతాడోనని ఉత్సుకతతో ఎదురుచూసిన రవి నవ్వుతూ, "లేదు... " అన్నాడు.

"ఏమైనా.... అదే! మా మగారి అమ్మాయీ- లేదా.... ఫ్రెండ్స్... " మొహమాటంగా అడిగాడు జయరామ్.

"అవేమీ లేదండీ, ఉద్యోగంలో స్థిరపడ్డాక చేసుకుందా మనుకున్నాను" అన్నాడు రవి.

"ఇప్పుడు స్థిరపడ్డారుగా!" అన్నాడు జయరామ్.

"అవును...."

"పెళ్ళికి సిద్ధంగా ఉన్నారన్నమాట!"

"అన్నమాటే!" అన్నాడు రవి నవ్వుతూ

ఆయనకి అమ్మాయి ఉన్నట్టు కూడా తెలీదు రవికి.

"మీరు చాలా నయం!.... రజని పెళ్లి చేసుకుంటానని.... అదే! పెళ్ళికి అంగీకారం చెప్పడానికి సంవత్సరం తీసుకుంది" అన్నాడు జయరామ్.

"రజని అంటే...."

"మా అమ్మాయి. నాకు ఆమె- కాక రవీంద్ర. వాడు స్టేట్స్‌లో ఉన్నాడు. రజని బి. ఏ. ముగించి ఇంక చదువు చాలని, వాడిదగ్గరికి వెళ్లింది. వచ్చే పది పదిహేను రోజుల్లో తిరిగివాస్తుంది."

"అలాగా!"

"అవునండీ, దాని పెళ్లి అయితే, నాకు పెద్ద బెంగ తీరిపోతుంది. రోజులు ఎలాగ ఉంటాయో చెప్పలేం కదా!.... రజని వండ్రఫుల్ గర్ల్!- స్వీట్ నేచర్ ... రవిగారూ! మనిషికి ఎంత డబ్బు ఉంటేనేం? ఇలాగ చక్కని అమ్మాయి ఉండి, ఆమెకి యోగ్యుడైన వరుడు దొరికి.. వాళ్ళ సుఖంగా ఉండి బాగుంటే అదే ఆనందం! అదే సుఖం" అన్నాడు జయరామ్.

"అవునండీ" అన్నాడు రవి

"రండి- ఆమెని కలియలేకపోయినా ఆమె ఫోటో అయినా చూద్దురుగాని" అంటూ జయరామ్ రవిని ఎదురు గదిలోకి తీసికెళ్ళాడు. అక్కడ గోడకి ఉన్న ఒక ఫొటో చూపించి, "అది మా రజని. ఈ చిన్న ఫొటో కిందటినెల తీయించింది... బాగుంది కాదూ" అన్నాడు.

"అవును చాలాను.. " అన్నాడు, నిజం చెప్తూ, రవి

"భగవాన్ కృప.. ..నం ఇచ్చినట్టు ఉంటుంది.... ఈ రూమ్ చూశారుగా!

అంతా ఆమెది...." అంటూ మళ్లీ సిటింగ్ రూమ్‌కి దారితీశాడు. వెళ్లే ముందు గదిచుట్టూ కలియచూశాడు రవి. చక్కటి పుస్తకాలు. కళాఖండాలూ... అన్నీ కనిపించాయి.

"మీరు తండ్రిగా అదృష్టవంతులు" అన్నాడు జయరామ్‌తో.

"అవును. ఆమెకి తల్లిలేదు. నాలుగేళ్లయింది. కాని, ఆమెకి భర్తగా వచ్చేవాడూ చాలా అదృష్టవంతుడు...." అన్నాడు జయరామ్.

రవి ఏమీ అనలేదు.

"మిమ్మల్ని చూసి-చాలా సరదాపడ్డాను. అవతలివాళ్లని అర్థంచేసుకునే శక్తి ఉంది మీకు. అందుకే- మీరంటే చాలా అభిమానం నాకు. మీరు రాకముందు మిమ్మింపెన్సనుంచి రోజుకో ఉత్తరం వచ్చేది. మీరు ఉత్తరాలు రాయరు. ప్రాక్టికల్. అది నాకు నచ్చింది" అన్నాడు జయరామ్.

"థేంక్స్" అన్నాడు రవి.

"మీరు- రజనిని కలుసుకోండి. ఏం జరుగుతుందో ఎవరికి తెలుసును?- ఆమెది చాలా సున్నితమైన మనస్తత్వం. ఆమె రాగానే ఫోన్ చేస్తాను. రండి...." అన్నాడు జయరామ్ రవి తల ఊపేడు. విషయం మార్చి, కొంచెం సేపట్లో డిన్నర్ సర్వ్ చేయించాడు జయరామ్. మళ్ళీ రజని విషయం రాలేదు-వీడ్కోలుదాకా. "వచ్చే నెల- టెలిఫోన్ చేస్తాను, తప్పకరండి. రజనిని చూద్దురుగాని" అన్నాడు. అంతే.

అంతే.

రవికి రజనిని చూడ్డం పడలేదు. జయరామ్‌తో కలిసినప్పుడు ఆమె ప్రసక్తి రాలేదు. కలిసినప్పుడు అతని టెలిఫోన్ రాలేదు. శుభలేఖ వచ్చాక తెలిసింది- ఆమెకి మోహన్‌కి పెళ్లి నిశ్చయం అయిందని.

ఆమె ఇండియాకి తిరిగివస్తూంటే బొంబేలో కలిసేడు మోహన్. కస్టమ్స్ వించి ఆమెని ఏ శ్రమలేకుండా బయటికి తెచ్చాడు. వాళ్ల బంధువుల ఇంటికి తీసికెళ్లేడు. ఆమెతో మూడు రోజులు- అహోరాత్రాలు గడిపేడు చివరి నిమిషంలో నిర్ణయించుకుని ఆమెతో మద్రాసు వచ్చాడు, స్వంత ఖర్చుమీద. ఆ తరవాత వారానికోసారి వచ్చి ఆమెని కలిసేవాడు. అలాగ- రజనిని తనదాన్ని చేసుకున్నాడు.

ఆ తరవాత కొద్దిరోజుల్లోనే రవి మమతని పెళ్లిచేసుకున్నాడు. రజని విషయంలో అతనికి విచారం ఏమీ లేదు- ఇప్పటిదాకా ఆమె ఫోటోని తప్ప ఆమెని చూడనేలేదు కాని, మోహన్ ఆమెతో ఎలాగ పరిచయం సంపాదించాడు? ఆమె స్టేట్స్‌నుంచి ఎప్పుడు ఏ ప్లయిట్‌లో వస్తుందో అతనికి ఎలాగ తెలిసింది? అలాటి ప్రశ్నలు ఒకటి రెండుసార్లు వేధించాయి. బహుశా జయరామ్

అప్పుడు బొంబేలో ఉండి ఉంటాడు. తన కంపెనీకి ముఖ్యులందరినీ వ్యక్తిగతంగా కలిసి వారిని ఆకట్టుకోటం నేర్చుకుని అలవాటుచేసుకున్న మోహన్ ఆ తరుణం చక్కగా వినియోగించుకుని, ఆ కోటీశ్వరుడి అల్లుడయ్యాడు.... అని తనకి తానే జవాబు చెప్పుకుని మళ్ళీ మళ్ళీ ఆ విషయం ఆలోచించటం మానుకున్నాడు రవి. ఇవాళ జ్ఞాపకం వొచ్చింది.

టెలిఫోన్ మోగింది.

లేచి రిసీవర్ తీసుకోగానే అవతల మోహన్ మాట్లాడుతున్నాడు. "సారీ రవీ....రజని మిమ్మల్నే రమ్మంటుంది... నువ్వూ, శ్రీమతీ ఎనిమిది గంటలకల్లా రండి. వీలైతే ఇంకా ముందరే. ఏం?"

"మీ రిద్దరూ వొస్తారనుకున్నాను...." అన్నాడు రవి.

"అదే నా కోరిక.... కాని, ఏం చేసేదీ? రజనికి మళ్ళీ ఇల్లు కదలాలని లేదు. ఈ రెండు రోజులూ తిరిగి తిరిగి అలిసిపోయింది. పూర్ గర్ల్. ఆమె మరీ డెలికేట్!...."

"పోనీలే. ఆవిడ అలా ఉంటే డిన్నర్ కాన్సిల్ చెయ్యి" అన్నాడు రవి

అవతల రెండు క్షణాల నిశ్శబ్దం. మోహన్ రజనిని అడిగి సమాధానం చెప్తోన్నట్టు ఉంది.

"మీరు తప్పకుండా రావాలి రవీ! మమతని కలిపేందుకు రజని చాలా ఉత్సాహపడుతోంది. ప్లీజ్!" అన్నాడు మోహన్.

"సరే" అన్నాడు రవి.

"కారు పంపేదా?" అన్నాడు మోహన్. తనకి కంపెనీ కారూ, అటు మామగారిదీ ఉన్నాయని తనకి తెలియాలని ఆ ప్రశ్న, అనిపించింది రవికి.

"వొద్దులే.... నా కారు ఉంది" అన్నాడు.

"సరే. ఎనిమిదికి...." అని డిస్కనెక్ట్ చేశాడు మోహన్.

మమతని పిలిచి జరిగింది చెప్పి ఏదో పుస్తకం చదువుతూ నిద్రపోయాడు రవి. మమత అతన్ని ఏడుకి నిద్ర లేపింది. ఎనిమిదికి జయరామ్‌గారి ఇంటికి చేరేరు. ఆయన ఇంట్లో లేరట. యూరప్ వెళ్లేరని చెప్పింది రజని.

మమతని పరిచయం చెయ్యగానే, "మార్వెలస్ బ్యూటిఫుల్!...." అంది రజని, మమతని జాగ్రత్తగా పరికిస్తూ.

పక్కకి తీసికెళ్లి మోహన్, "చూశావా! రాణికే నచ్చింది నీ మమత. నిజంగా లక్కీ ఫెలో నువ్వు" అన్నాడు

నానా ఆలోచనలు ఉక్కిరిసాగి వొచ్చాయి రవికి. చిరునవ్వుతో, "నువ్వూ ఏమీ తక్కువ కాదులే!" అన్నాడు.

"నేనూ మమత కంట్లో చెప్పుతుంటాను. మీరు... కాంప్లిమెంట్ చెయ్యండి" అంది రజని మమత [illegible]

లోపలికి వెడుతూ. అప్పటిదాకా ఆమెని పరీక్షగా చూడలేదు రవి.

చూశాక, ఆమెకీ, అప్పటి ఫొటోకీ చాలా భేదం ఉందని అనిపించింది రవికి. రెండేళ్ళలో ఇంత మారిపోతారా మను షులు, అనుకుని అతను ఆశ్చర్యపడ్డాడు. రజని బాగా వొళ్ళుచేసింది. ఆ ఫొటోలోని లావణ్యం ఏమీ ఆమెలో కనిపించ లేదు. అదీకాక, మమత పక్కన ఆమె వెలవెలబోతూంది.... ఆమె కట్టుకున్న ఖరీదైన చీరా, పెట్టుకున్న నగలూ, వజ్రాలూ— అన్నీ ఆమెని మమతకన్న ఏ విధంగానూ ఆకర్షణీయంగా చెయ్య లేకపోయాయి.

వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు.

"మెనీ మెనీ థేంక్స్" అన్నాడు కొత్తగా మళ్ళీ స్వాగతం చెప్తూ మోహన్.

"సంతోషం నాదే మోహన్!...." అన్నాడు రవి, మనసారా. జీవితంలోని ఒక అసంతృప్తి, చిన్నదే అయినా, ఈ క్షణంలో తొలగిపోయింది.... ఆ అసం తృప్తి తనకీ మమతకీ మధ్య ఒక తెర లాగ నిలిచింది. తనకి తెలియకుండానే అది ఆమెని రానిచ్చేంత దగ్గరికి రానీ లేదు. అది లేకపోతే వెంటనే మమతని పిలిచి ఇంటికి వెళ్ళిపోయి ఆమెతో కబుర్లు చెప్తూ కూర్చోవాలనిపించింది రవికి. ఆమెకి ఎప్పుడూ అనుభవంలేని తియ్యటి కబుర్లు.

"ఏమిటి, ఆలోచనలోపడ్డావు?" అన్నాడు రవి. బేరర్ వొచ్చి విస్కీ గ్లాసులు, ఐస్, సోడా— అన్నీ జాగ్రత్తగా టేబిల్‌మీద పెట్టాడు. మోహన్ వాడిని వొద్దని తానే డ్రింక్స్ తయారుచెయ్య సాగాడు.

"ఏమీలేదు మోహన్!.... ఇందాక నన్ను లక్కీ—ఫెలో అన్నావే! అది ఆలోచిస్తున్నాను" అన్నాడు రవి. లోలోపల ఉండి కాలిలో ముల్లులాగ ఉండీ ఉండీ తనని బాధిస్తోన్న మిగిలిన చిన్న బాధలు కూడా ఇవేళ తీరిపోవాలని ఉంది అతనికి.

"నిజం చాలా సిన్సియర్‌గా చెప్పేసు" అన్నాడు గ్లాసు అందిస్తూ, చీర్స్ చెప్తూ మోహన్.

"అవును. నాకు తెలుసును కాని, అన్నివిధాలా నాకన్న నువ్వు అదృష్ట వంతుడివి మోహన్! నీకు తెలుసు" అన్నాడు రవి.

మోహన్ చిరునవ్వు నవ్వేడు. "అదీ నిజమే రవీ!— నీవుద్దేశం నాకు తెలుసును. అదృష్టం రకరకాలు ఏం?" అన్నాడు మోహన్.

"అవును. కాని— నీకు అన్ని రకాల అదృష్టమూ ఉంది!"

"అది చూసేవాళ్ళనిబట్టి ఉంటుంది— సాయంత్రం నీ ఇంట్లో తిన్న టిఫిన్— అది అదృష్టం!"

రవి నవ్వేశాడు.



నవ్వు. కాని, చాలా కాలంనించి జిహ్వ చచ్చింది రవీ! మా ఇంట్లో అంతా ఇంగ్లీష్ ఫేషన్. వంటలు ఇంగ్లీషు. రజనికి కారం అన్నమాట కూడా పడదు. అసలు మన వంటలే వచ్చును. నా బాధ నీకు తెలీదు." అన్నాడు మోహన్. చాలా కాలంనించి అతనికి బాధగా ఉన్నట్టు తెలిసింది రవికి. కాని, ఈ చిన్న విషయం అతనికి అంత పెద్దగా అనిపిస్తుందని రవి నమ్మలేక పోయాడు.

"అది చాలా చిన్న విషయం.... కుక్‌తో చెప్తే సరి" అన్నాడు రవి, నవ్వుతూ.

"వాళ్లకి నేరుగా ఆజ్ఞలిచ్చే అధికారం నాకు లేదు బ్రదర్. ఇదంతా చూసి మోహన్ కేంలే! అనుకుంటావు. . కాని- ఎలా చెప్పేది? అన్నీ ఉన్నాయి నాకు. మా కిచెన్ చూడు- మా బెడ్ రూమ్ చూడు....అద్భుతంగా ఉంటాయి! కాని అన్నీ చూడడానికే రవీ! ఆమెకి ఎప్పుడూ వొళ్లో అలసట. ఏది కాదన్నా -తల బద్దలయిపోయే తలనొప్పి!- నీకు తెలీదు రవీ! నువ్వు నిజంగానే అదృష్టవంతుడివి. నా డబ్బూ- నా ఆస్తి ... అదే- అన్నీ రజనిపేరనే ఉన్నాయనుకో. "

ఆగిపోయాడు మోహన్. రవీ మాట్లాడలేదు.

నిశ్శబ్దంగా డ్రింక్స్ సిప్‌చేస్తున్నారు.

బేరర్ పకోడీలూ, జీడిపప్పూ, అప్పడాలూ తెచ్చి పెట్టేడు. నిశ్శబ్దంగానే వెళ్లిపోయాడు.

మరో డ్రింక్ తయారుచేసి రవికిచ్చి తనూ తీసుకున్నాడు మోహన్.

"ఇవన్నీ- అన్ని సంసారాల్లోనూ

ఉండేవే మోహన్! ... ఏదో చిన్న కొరతలేని సంసారం ఎక్కడ ఉంది చెప్పు? అది చూసి బాధపడడం. నీకు తగదు" అన్నాడు రవి, మరేమనాలో తెలీక. తనమీద మాటిమాటికీ గెలిగిన ఈ మనిషి వెనకాల అంత ఓటమి ఉందన్న విషయం అతనికి సంతృప్తి ఎక్కువచేసింది. అదీ అతనికి బాగా లేదు. ఒకరి బాధ రవికి ఆనందం కలుగ జెయ్యదు.

కొంత ద్రవం తొందరగా తాగేడు మోహన్.

"అది నిజమే రవీ! కాని ..." అని ఆగి "ఏం లాభంలే! కడుపు నిండిన వాడివి నువ్వు- నీకేం అర్థమౌతుంది!" అన్నాడు మోహన్.

"నా బాధలు నాకూ ఉన్నాయి" అన్నాడు రవి చిరునవ్వుతో.

"అవును. మరి నువ్వూ మానవుడివే! కాని, అవి చిరునవ్వుతో చెప్పుకునే బాధలు ఇక్కడికి వచ్చిందంటే 'మమత నీతో వాదించిందా? అసలు ఆమెని అడక్కుండానే సరేనన్నావు. నేనైతే అన్నింటికీ ముందర అనుమతి తీసుకోవాలి. మమత- అంత చక్కటి మనిషి అని కాదు నిన్ను లక్కీ-అనడం... ఆమె అంత సౌమ్యమైనదని! " అని నిట్టూర్చి, "కానీలే. సారీ, ఏదైనా చెప్పు. ఈ టాపిక్ వొదిలేద్దాం" అన్నాడు మోహన్.

మరో పావుగంట కంపెనీ విషయాల్లోకి దిగి గడిపారిద్దరూ. మోహన్ మళ్ళీ ఎప్పటిలాగా అయిపోయాడు.

భోజనాలదగ్గర అందరూ చాలా ఉత్సాహంగా ఉన్నారు. రజని హఠాత్తుగా "రవీ! మీరిద్దరూ హనీమూన్‌కి వెళ్ళలేదట. ఏం?" అంది.

తల ఎత్తి ఆమెని దిగాలున చూసింది మమత. కాని రజని రవివైపు చూస్తోంది.

నిజం చెప్పాలంటే అప్పటికి రజని ఉదంతం కలుగజేసిన ఓటమిలాటి భావన తనకీ మమతకీ మధ్యన వొచ్చి, హనీమూన్ సరదాలేకుండా చేసిందని చెప్పాలి. కాని నిజంచెప్పడం ఎంత పుణ్యమైనా, మర్యాద కాని పరిస్థితులు చాలా ఉంటాయి.... వాటిలో ఇది ఒకటి.

"అప్పుడు కుదరలేదు" అన్నాడు రవి, పొడిగా మమత ఆమెతో ఏమిటి చెప్పిందోనని అతనికి ఆలోచన.

"అంటే మమత నిజమే చెప్పిందన్న మాట!.. " అంది రజని.

"మమత-ఎప్పుడూ నిజమే చెప్తుంది" అన్నాడు రవి, క్షేమంగా ఉంటూ.

రజని నవ్వింది. "ఐలే దంపతులు మీరు! చూడు మోహన్! నేర్చుకో! ఆయనమీద ఈగనైనా వాలనివ్వదు ఈవిడ. ఈమె మీద దోమనైనా వాలనివ్వడు అతను. స్వీట్!." అంది రజని.

ఆ తరవాత అప్పటిదాకా ఉన్న ఉత్సాహం పోయింది. డిన్నరెలాగో ముగిసింది.

నాలుగైదు నిమిషాలు రజనీ మమతా కనపడలేదు. అప్పటికి రవి తిరుగు ప్రయాణానికి సిద్ధంగా ఉన్నాడు.

"చూడండి! మీ ఆవిడ లక్షణంగా ఇంటికి వొచ్చిన చెల్లెలిలాటి దానికి చిన్న బహుమానం ఇస్తే కాదంటుంది" అంది రజని ఫిర్యాదు చేస్తూ.

"థేంక్స్! కాని వొద్దండీ మీ శుభా కాంక్షలే చాలు!" అంది మమత దృఢంగా రజని వేళ్లమించి చక్కటి ముత్యాలహారం వ్రేలాడుతోంది

"మీరైనా చెప్పండి" అంది రజని అతనికి మళ్లీ అప్పీల్ చేస్తూ.

చిరునవ్వుతో, "మమత చెప్పిందే రైటు రజనిగారూ!" అన్నాడు

నిరాశతో హారం టేబిల్ మీదికి జారవిడిచింది రజని. ఆమె ముఖంలో కోపం స్పష్టంగా తెలుస్తోంది. హారం టేబిల్ మీంచి జారి కిందపడింది. మోహన్ అదితీసి మీదని పెట్టబోయాడు. ఆమె అతని వైపు ఉరిమిచూసింది అతను హారం జారివిడిచేడు, మళ్లీ కింద పడింది

అందరూ చాలా మొహమాటంగా సెలవుతీసుకున్నారు. రజని గదిలోంచి ఇవతలకి రాకపోయినా, నవ్వుతూ, ధన్యవాదాలు చెప్పి వీడ్కోలు చెప్పి తప్పకుండా బొంబే ఇద్దరూ కలిసి రావాలని చెప్పింది. కారుదగ్గరకు వొచ్చి రహస్యంగా, "సారీ రవీ! అన్నాడు మోహన్.

అతని చెయ్యి నొక్కుతూ, "అది సరేకానీ మోహన్ మనం చాలా కాలంనుంచి స్నేహితులం" అన్నాడు రవి.

"థేంక్స్" అన్నాడు మోహన్.

ఇంటికి వెళ్ళేదాకా ఇద్దరూ మాట్లాడలేదు.

రవి బట్టలు మార్చుకుని వొచ్చి పడుకుని పుస్తకంతీసి చదివే ప్రయత్నం చేశాడు. ఆ సాయంత్రం జరిగినవన్నీ అతన్ని చాలా కలవరపెట్టాయి. మోహన్ జీవితంలో చూడరాని ఒక భాగం చూడడం అతనికి అశాంతిని కలుగజేసింది. అతని దృష్టి పుస్తకం మీద ఉన్నా, మనసు ఎక్కడో ఉంది.

మమత ఎప్పుడు వొచ్చిందో చూడలేదతను "రజనితో నేనలాగ చెప్పలేదండీ" అన్న ఆమె మాటలు విని ఆశ్చర్యంగా లేచి కూర్చున్నాడు. రజని మంచంమీద కూర్చుంది. ఆమె కళ్లు కొంచెం ఎర్రగా ఉన్నాయి.

"ఏమిటి నువ్వనేది మమతా?" అన్నాడు రవి. అతనికి అర్థంకాలేదు ఆమె మాటలు.

"అదేనండీ! మనల్ని గురించి ఆమె చాలా ప్రశ్నలు వేసింది. హనీమూన్‌కి వెళ్లారా అంది... కుదరక వెళ్లలేదన్నాను. ఏమిటి కుదరలేదన్నానని గుచ్చి గుచ్చి అడిగింది.... ఏదో చెప్పేను...."

"అయితే- నువ్వెందుకు బాధ పడడం?" అన్నాడు రవి. దుఃఖం ఆపుకుంటూన్న మమత అతన్ని అయోమయ పరిస్థితిలో పెట్టేసింది.

"మీరు- మరోలా అనుకున్నందుకు" అంది మమత. ప్రయత్నం చేసి మాటాడుతూ.

"అలా ఎందుకనుకున్నావు?" అన్నాడు రవి.

"మీరు ఎక్కువ మాటాడరు. కాని.... మీరు కోపంగా ఉన్నప్పుడు తెలుస్తుంది" అంది మమత. ఈసారి ఆమెకు కన్నీళ్లు ఆగలేదు.

చేతిలో ఉన్న పుస్తకం అటు పడేసి, "ఇటు చూడు మమతా!" అన్నాడు రవి.

భయపడతోన్నట్టు చూసింది మమత.

"నేనంటే-నీకు భయమా?" అన్నాడు రవి. ఇలాగ ఈ సంవత్సరం చిల్లర లోనూ ఆమెతో ఎప్పుడూ మాట్లాడలేదు.

మమత తల వాంచుకుంది. రెండు కన్నీటిబొట్లు జారడం చేస్తూ ఆమె బుగ్గల మీదికి జారాయి.

ఆమెని దగ్గరకు తీసుకుని, కళ్లు తుడిచి, "నీకు ఎంత అందం ఇచ్చాడో దేవుడు- అందులో సగం కూడా తెలివి తేటలు ఇవ్వలేదు" అన్నాడు రవి.

ఇంకా దగ్గరగా వొచ్చే ప్రయత్నం చేయలేదు మమత. బిగుసుకుపోయినట్టు కూర్చుంది,

"రజని- ఇంకా ఏం అడిగింది?"

తల వాంచుకునే, "చాలాను.... అవన్నీ మీకు చెప్పలేను. దయచేసి అడక్కండి" అంది మమత.

"సరేలే... కాని- ఏదో దాస్తున్నావు. ఏమిటది! అంతగా నువ్వు బాధపడ్డా వంటే ఏదో ఉండితీరుతుంది. ఏమిటది?" అన్నాడు రవి.

రెండునిమిషాలుమమత మాట్లాడలేదు. ఎదురుచూస్తూ రవీ మాట్లాడలేదు.

చివరికి మమత, చిన్నగా, "మీరు- ఆమెను చేసుకుందామని ప్రయత్నించారటగా?" అంది.

"అలా చెప్పిందా?"

"అవును."

"నువ్వే మనుకున్నావు?"

దీటుగా అతని కళ్లలోకి చూసి మళ్లీ తల వాంచుకుంది మమత.

"ప్రయత్నించింది నేను కాదు వాళ్లనాన్న. అంతే" అన్నాడు రవి.

మమత మాట్లాడలేదు.

"ఆ ముత్యాలహారం- ఎందుకు ఇస్తానంది?" అన్నాడు రవి

"మాటల్లో నా నగల గురించి అడిగింది ఎంత ఇష్టంలేకపోయినా నాదగ్గర ఏమున్నాయో మళ్లీ మళ్లీ అడిగింది.... అన్నీ విన్నాక- 'నీ అంత చక్కటిదానికి అలాంటి హారం ఒకటైనా ఉండాలి' అంటూ అది నా మెడలో వేసింది. తీసేశాను. చివరికి ఎలాగో లేచి వొచ్చాను- ఆమె గూడా వొచ్చింది."

ఆమె ముఖం తనవేపు తిప్పుకుని,— "నువ్వేం చేశావో తెలుసా మమతా?" అన్నాడు రవి.

ఏమిటన్నట్టు చూసింది మమత.

"నా పరువుని నిలబెట్టావు. నిజానికి– ఎక్కువ చేశావు. నిన్ను అభినందించకుండా ఉండలేను" అంటూ ఆమెని మరింత దగ్గరగా తీసుకున్నాడు రవి.

"నిజంగానా?" అంది మమత.

"అంతకన్న నిజమైనది నాకేమీ తెలీదు.... నువ్విక్కడ ఉన్నావన్నమాట తప్ప–"

మమత ముఖం విడింది.


"మరి.... నన్ను ఫూల్ అన్నారు?" అంది.

"అవును. నాకు ఇంత సహాయం చేసి.... ఏదో తప్పుచేసినట్టు బాధపడిపోయావు గనక అన్నాను.... వెంటనే చిరునవ్వు నవ్వకపోతే మళ్లీ అంటాను."

మమత అందరిలాగా చిరునవ్వు నవ్వలేదు. ఆమె కళ్లలోకి కాంతి వొచ్చింది– బిగుసుకున్న మనిషి సడలి అతనిమీదకి నెమ్మదినెమ్మదిగా ఒరిగింది.

"ఈ రోజు... మనం హనీమూన్‌కి ప్లాన్ వెయ్యాల్సిన రోజు.... నీకు తెలుసా?" అన్నాడు రవి.

"ఆ మాట ఎత్తకండి"



"నో. మనం ఇప్పుడు వెడితేనే సరదా. పరస్పర పరిచయాలకి మనకి కొంచెం టైము పట్టింది. ఇంక మన మధ్య ఏమీలేదు. చెప్పు ఎక్కడికి వెడదాము?" అన్నాడు రవి.

"మీ ఇష్టం..." అంది మమత.

"అన్నీ నా ఇష్టం అంటే ఎలాగ?" అన్నాడు రవి నవ్వుతూ.

"అన్నీ కాదులెండి. కొన్ని నా యిష్టాలూ ఉంటాయి" అంది మమత చిరునవ్వుతో.

"ఒకటి చెప్పు"

"మిమ్మల్ని లక్కీఫెలో అనడం" అంది మమత.

"అది నిజం మమతా! నీకు తెలియనంత నిజం" అన్నాడు రవి లైటు తీసేస్తూ.